యోగా డే వేడుకలకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మాధవరం కాంతారావు తదితరులు

కూకట్‌పల్లి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 21న కూకట్‌పల్లిలో నిర్వహించనున్న యోగా డే వేడుకలకు నిర్వాహకులు శనివారం స్థల పరిశీలన చేశారు. ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ అధ్యక్షులు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. యువత పెద్ద ఎత్తున భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో యోగా గురువు శివుడు, శ్రీకర్‌రావు, పద్మయ్య, పవన్, వినోద్ గౌడ్, రమేష్, బీజేవైఎం నాయకుడు వినోద్, అభియాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ మహోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ, రోడ్డు నెంబర్ 2లోని శ్రీ వీరాంజనేయ స్వామి, నీలకంఠేశ్వర స్వామివారి దేవస్థానం 39వ వార్షిక మహోత్సవాలు ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మాధికారి జై శంకర్ బాలగోపాల్, దేవస్థానం ఫౌండర్ సుబ్బారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు పుణ్యాహవాచనం, రక్షా బంధనం, మృత్యంగ్రహణం, అంకురార్పణ, రుత్విక్వరణం, 10 గంటలకు లక్ష తమల పాకుల పూజ సామూహికంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పరిసర ప్రాంత భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యువకుడు అదృశ్యం



జగదీష్ కుమార్ (ఫైల్)

మియాపూర్: ఉద్యోగం కోసం నగరానికి వచ్చిన యువకుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పొన్నూరు తాలుకా ఆరమండ గ్రామానికి చెందిన సూరినేని జగదీష్‌కుమార్(32) గత నెల 27వ తేదీ నగరానికి వచ్చి మియాపూర్ న్యూ హఫీజ్‌పేట్ మార్తాండ నగర్‌లో స్నేహితుడు అరవింద్ కుమార్‌తో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 10వ తేదీ ఉదయం 3 గంటల సమయంలో జగదీష్ కుమార్ బ్యాగు తీసుకుని బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో అతని స్నేహితుడు అరవింద్ తండ్రి సూరినేని పోలేశ్వర్‌రావుకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల విచారించినా ఆచూకి లభించలేదు. దీంతో తండ్రి పోలేశ్వర్‌రావు మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చందానగర్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం 2023 సంవత్సరం ఆగస్టు 17వ తేదీ రాత్రి 9.00 గంటలకు ఓల్డ్ ఎంఐజీలోని పోచమ్మ దేవాలయం సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) కింద పడిపోయాడు. దీనిని గమనించిన పెట్రోలింగ్ పోలీసులు చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గత రెండు సంవత్సరాల నుంచి చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అలరించిన కూచిపూడి విభావరి



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కూచిపూడి నాట్యగురువు మద్దాలి ఉష గాయత్రి శిష్యబృందంచే కూచిపూడి విభావరి ఆకట్టుకుంది. ఇందులో శివదీక్ష, ప్రహ్లాద పట్టాభిషేకం, బాల కనకమయ, చక్కనితల్లికి, శ్రీకృష్ణ జనన శబ్దం, అలరులు కురియగా, గొల్లకలాపం, తిల్లాన తదితర అంశాలను కళాకారులు వాసవిచౌదరి, ఆశ్రితషిండే, యశస్వినీ, శ్రద్ధ వారణాసి, సహస్ర చరిష్య తదితరులు ప్రదర్శించారు.

ఔరా.. హౌసింగ్‌బోర్డు!

నగరంలో భూముల ధరలు తగ్గుతుంటే ఇక్కడ మాత్రం పెరుగుతున్న వైనం

- స్వల్ప వ్యవధిలోనే రూ.3 లక్షలకు చేరువకు గజం ధర
- జేఎన్టీయూ – హైటెక్‌సిటీ రహదారి నిర్మాణంతో మారిన రూపురేఖలు
- జాతీయ, అంతర్జాతీయ 'రియల్' ప్రాజెక్టులు
- 18 స్థలాలకు వేలం వేస్తే హౌసింగ్‌బోర్డుకు వచ్చిన ఆదాయం రూ.141.36 కోట్లు



అధునాతన జీవన శైలికి అద్దంపట్టే కేపీహెచ్‌బీ నిర్మాణాలు...

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ మరోసారి 'రియల్'రంగంలో రికార్డులు తిరగరాసింది. అప్పుడెప్పుడో 20 ఏళ్ల క్రితం ఇక్కడ గజం ధర లక్ష రూపాయలు పలికితేనే అప్పటి ఉమ్మడి ఏపీ యావత్తు అవాక్కయ్యింది. తాజాగా జరిగిన హౌసింగ్‌బోర్డు స్థలాల వేలంలో దిమ్మదిరిగేలా గజం ధర ఏకంగా మూడు లక్షలకు చేరువగా పలికి గత రికార్డులు పటాపంచల్ చేసింది. మహానగరంలో సంపన్న వర్గాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాలను తలదన్నే రీతిలో ఇక్కడ భూముల ధరలకు రెక్కలు రావడంతో అందరి దృష్టి ఇప్పుడు కేపీహెచ్‌బీ వైపే పడింది. 15– 20 ఏళ్ల క్రితం వరకు హౌసింగ్‌బోర్డు అంటే ఒక మామూలు ప్రాంతమే. రానురాను కాలనీ భారీగా విస్తరించింది.

'స్పైనల్'రోడ్డు.. కేపీహెచ్‌బీ గతిని మార్చే..

- నగరంలో అప్పుడప్పుడే సాంకేతిక విప్లవం పురుడుపోసుకుంటున్న రోజులవి. హైటెక్ సిటీ రాకతో నగరానికి 'హైటెక్'హంగులు వచ్చేశాయి. హైటెక్ సిటీకి కేపీహెచ్‌బీ కూతవేటు దూరమే అయినప్పటికీ ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా ఉండేవి. ఈ రెండింటి మధ్య సహజసిద్ధ కొండలతో అటువారు ఇటు.. ఇటువారు అటు వచ్చే వీలులేదు. దీంతో కేపీహెచ్‌బీ నుంచి హైటెక్ సిటీ వెళ్లాలంటే వయా అమీర్‌పేట, జూబ్లీహిల్స్ మీదుగా తిరిగి రావాల్సి ఉండేది.
- ఎప్పుడైతే ముంబాయి హైవేను కలుపుతూ జేఎన్టీయూహెచ్ నుంచి హైటెక్ సిటీకి స్పైనల్ రోడ్డు నిర్మాణం జరిగిందో కేపీహెచ్‌బీ ప్రాంతం తిరుగులేని 'రియల్'వ్యాపారానికి అడ్డాగా మారింది. రానురాను ఈ రహదారిలో ఫ్లైఓవర్ల నిర్మాణం కూడా జరగడంతో ఈ ప్రాంతం నుంచి సైబర్ సిటీకి రాకపోకలు మరింత సులువయ్యాయి. జాతీయ, అంతర్జాతీయంగా పేరెన్నిక గన్న బడా రియల్ సంస్థల కన్ను కేపీహెచ్‌బీపై పడింది. ఇంకేం.. ఆకాశమే హద్దుగా హౌసింగ్ బోర్డు ధరలకు రెక్కలు తొడిగేశారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు ధరలు అంతకంతకూ పెరిగి రియల్ ఎస్టేట్ వ్యాపారులకే షాకిచ్చేలా మూడు లక్షలకు దగ్గరగా గజం ధర పలకడం గమనార్హం.



మలేసియా టౌన్‌షిప్ రాకతో ..

- అప్పటి వరకు హౌసింగ్‌బోర్డు వ్యక్తిగత గృహాలతో పాటు జీ ప్లస్ 2 తరహాలో నిర్మించిన ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ గృహాలే ఇక్కడ ఉండేవి. జేఎన్టీయూ–హైటెక్ సిటీ రోడ్డు నిర్మాణం తర్వాత మలేసియా టౌన్‌షిప్ నిర్మాణంతో ఇక్కడ హైరైజ్డ్ కల్చర్‌కు రాచబాట పడిందనే చెప్పాలి. దీని తర్వాత హౌసింగ్ సెంటర్, లోధా అపార్ట్‌మెంట్స్, ఫోరం మాల్, మంజీరా, ఇందూ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఇక్కడకు వచ్చాయి.
- ఇక చిన్న, మధ్య తరహా రియల్‌ఎస్టేట్ సంస్థలు తాము సైతం తక్కువ కాదన్నట్లుగా రంగ ప్రవేశం చేయడంతో ఇక్కడ అపార్ట్‌మెంట్ కల్చర్ వేళ్లూనుకుంది. ఒకప్పుడు షాపింగ్ అంటే అబిడ్స్, అమీర్‌పేట ప్రాంతాలే గుర్తుకొచ్చేవి. ఇప్పుడు వాటిని పక్కకు నెట్టేసి బడా వ్యాపార సంస్థలన్నీ ఇక్కడ తమ బ్రాంచ్‌లను ఓపెన్ చేశాయి. వస్త్ర, జ్యువెలరీకి సంబంధించి అన్ని కార్పొరేట్, ప్రైవేటు సంస్థలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి.

'రియల్'పడకేసిన తరుణంలో..

- ఇటీవల ఇక్కడి ప్లాట్లకు నిర్వహించిన వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు కాసుల వర్షమే కురిసింది. ఎడారిలో ఒయాసిస్సులా రియల్ ఎస్టేట్ రంగం పడకేసిందనుకుంటున్న ప్రస్తుత తరుణంలో గజం ధర అత్యధికంగా రూ.2,98,000 పలికి మరోసారి కేపీహెచ్‌బీ స్థలాలు రికార్డుల్లోకెక్కాయి. మూడు నెలల క్రితం నిర్వహించిన వేలంలో గజం ధర 1.81 లక్ష పలకగా, మూడు నెలల వ్యవధిలోనే మరో లక్ష పైచిలుకు పెరిగిపోవడం గమనార్హం.
- ఒకవైపు బిల్డర్లు తాము నిర్మించిన ఫ్లాట్లు అమ్ముడుపోవడం లేదంటూ నెత్తినోరూ బాదుకుంటుండగా, మరోవైపు ఎవరూ ఊహించని రీతిలో ఇక్కడి భూముల ధరలు ఒక్కసారిగా రెక్కలు తొడుక్కోవడం చూస్తుంటే హౌసింగ్ బోర్డులో కొలువుదీరిన సకల సౌకర్యాలే కారణంగా తెలుస్తోంది. మొత్తం 18 స్థలాలకు నిర్వహించిన వేలం ద్వారా హౌసింగ్‌బోర్డుకు రూ.141.36 కోట్ల మేర ఆదాయం సమకూరింది.

కల్యాణం.. కమనీయం

- సీతారాముల కల్యాణంలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు
- పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కృష్ణారావు



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని శ్రీ హరి హర క్షేత్రంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయ శిఖర సంప్రోక్షణ, సీతారాముల కల్యాణం వంటి పూజా కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అనంతరం అహోబిల జీయర్ స్వామి కరకమలములచే కుంభ ప్రోక్షణ, 11 గంటలకు సీతారాముల కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం, అనంతరం అన్న సమారాధన, సాయంత్రం భరత్ నగర్ కాలనీలో హనుమంత్ సేవ రాముల వారి ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, నాయకులు ప్రసాద్ రెడ్డి, దేవిరెడ్డి మనోహర్ రెడ్డి, విజయ కుమార్, సంతోష్, రవీందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మహిళలకు కుట్టుమిషన్లు అందజేత



మూసాపేట: యూత్ ఫర్ సేవ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు శనివారం సర్టిఫికెట్లను, కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ.. ఉచిత మిషన్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా ఇప్పటికీ 300 మంది విద్యార్థులు నేర్చుకున్నారని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు లేక అనేక మంది ప్రయివేట్ ఉద్యోగాలు చేస్తున్నారని, అదే టైలరింగ్ వంటివి నేర్చుకొని మరొకరికి ఉపయోగపడాలన్నారు. వృత్తి కోర్సులు నేడు సమాజంలో ఎంతో అవసరం అని అన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవిగౌడ్, దాసరి అబ్బాస్, శ్రీనివాస్ గౌడ్, యూత్ ఫర్ సేవ బృందం సభ్యులు సాయి, పూర్ణ, ఢిల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు కదలాలి

మోతీనగర్: విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్స్ కన్వర్షన్‌కై విద్యుత్ సిబ్బంది కుటుంబ సభ్యులతో ఈ నెల 18న ఉదయం 11 గంటలకు మింట్ కాంపౌండ్‌లో జరిగే బహిరంగ సభకు కదలాలని గ్రీన్‌ల్యాండ్ ఎలక్ట్రిసిటీ విద్యుత్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎన్‌ఎం పాష కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బహిరంగ సభకు ముఖ్య వక్తగా ప్రొఫెసర్ జి. హరగోపాల్ పాల్గొననున్నట్లు తెలిపారు.

బోనాల పండుగ నిధుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: బోనాల పండుగను అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధుల కోసం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని దేవాలయ నిర్వాహకులు 28లోగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిధులు మంజూరు కోసం దరఖాస్తులకు దేవాలయం పేరుతో ఉన్న లెటర్‌హెడ్, దేవాలయం, అమ్మవారి ఫొటోలు, దేవాలయం స్టాంప్, ఆలయ పాన్‌కార్డు, ఆలయం పేరు మీద ఉన్న బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, రిజిస్ట్రేషన్ పత్రం జిరాక్స్, ఆలయ చైర్మన్ లేదా కార్యదర్శి ఆధార్ కార్డు జిరాక్స్ వంటి పత్రాలను జత చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నాలా విస్తరణ పనులు పరిశీలన



నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం తదితరులు

మోతీనగర్: రామారావునగర్‌లో జరుగుతున్న నాలా అభివృద్ధి పనులను కార్పొరేటర్ సబిహాబేగం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో అదనంగా మంజూరు చేసిన రూ.1.90 కోట్ల నిధులతో నాలా విస్తరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. లోతట్టు ప్రాంతమైన రామారావునగర్‌లో నివసిస్తున్న ప్రజలకు నాలా సమస్య నుంచి విముక్తి కలిగేలా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నాలాలోని సిల్ట్ గ్రేవ్ యార్డ్ గోడ పరివాహక ప్రాంతంలో వేస్తున్న సిల్ట్ వల్ల ఇబ్బందిగా మారిందని స్థానికులు వివరించారు. దీంతో వీలైనంత త్వరగా సిల్ట్ తొలగించాలని ఆమె కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో నాగుల సత్యం, వెంకటయ్య, రామ్‌రెడ్డి, నర్సింహ, ఆవుల సంజీవ, వెంకటరమణ, సాంబశివ, రఘుపతి, కరుణాకర్, ముక్తార్, యాదగిరి, కృష్ణ, ఆంజనేయులు, భారతమ్మ, ఎల్లమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

క్యాండిల్ ర్యాలీ



ఆల్విన్‌కాలనీ: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మ శాంతించాలని కోరుతూ శనివారం ఆల్విన్ కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు మారెళ్ల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రవి, భాస్కర్, వాసు, దుర్గేష్, సురేష్, సుధాకర్, నారాయణ, నాగన్న గౌడ్, చంద్రయ్య, గోపాల్, లక్ష్మణ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపంగా శనివారం వై జంక్షన్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్, బ్లాక్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవ కమిటీ ఎన్నిక

నిజాంపేట్: జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆస్కానీ మారుతి సాగర్ అధ్యక్షతన నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో చెర్ల ఎల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద శనివారం బోనాల ఉత్సవ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ధర్మకర్తగా కొలను శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య సలహాదారులుగా కొలను సునీల్‌రెడ్డి, ముక్క దేవేందర్ గుప్తా, నాగేంద్రచారి, మేకల జీతయ్య, ఉత్సవ కమిటీ ఆలయ చైర్మన్‌గా మారుతిసాగర్, అధ్యక్షులుగా ముక్కర్ల లాలయ్య, ఉపాధ్యక్షులుగా కె.రాము యాదవ్, పి.మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శులుగా కె.వెంకట్, ఓ.లింగస్వామి, సహాయ కార్యదర్శులుగా టి.కృష్ణారావు, పితాని శ్రీనివాస్, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా ఎం.మారుతి కుమార్, కె.వి.వి సత్యనారాయణ, ఏ.గోవిందరావు, కె.రమేష్, దాలి నాయుడు, కోశాధికారులుగా టీకుల సుధాకర్‌రెడ్డి, దామెర జగదీశ్వర్‌గుప్తా, కార్యవర్గ సభ్యులుగా జి.శ్రీనివాస్, కె.వెంకటేష్, ఎం.మహేష్, లక్ష్మణ్, జి.వెంక్రటావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

- కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తానని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. ఫతేనగర్ డివిజన్ శాస్త్రి నగర్‌లో శనివారం స్థానికులతో కలిసి పర్యటించారు. కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడ కూలిందని, డ్రైనేజీ పైపులైన్ల అవసరం ఉందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన మాట్లాడుతూ.. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కుతాడి రాములు, శివశంకర్ గౌడ్, బద్రి, శంకర్, ప్రవీణ్, ఎర్ర నర్సయ్య, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం

- కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: హనుమాన్ నగర్ కాలనీ వాసుల సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శనివారం నాయకులతో కలసి ఆయన హనుమాన్‌నగర్‌లో పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు రోడ్లపైకి వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ డంప్ చేయవద్దని, నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చెత్తను పేరుకుపోకుండా తొలగించాలన్నారు. కార్యక్రమంలో హనుమాన్ నగర్ అధ్యక్షుడు పోచయ్య, రవికుమార్, నరసింహరాజు, సతీష్, రమేష్, సంపత్, మల్లేష్, బాల్‌రాజు, టెంపుల్ రాజు, మట్టి శ్రీను, రమేష్‌గౌడ్, జహంగీర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



రోడ్లపై పారుతున్న మురుగు నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

శ్రీవారి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం





స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు, నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 32వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పుత్రకామేష్టి యాగం, సంతాన యోగ్యతకై ఉదయం 10 గంటలకు గరుడ ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు శేషవాహన సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వివాహం కాని వారికి వివాహ యోగ్యతకై కల్యాణమస్తు, శుభ వివాహ ప్రాప్తి సర్వదోష నివారణ యాగం, సంతానం లేనివారికి పుత్ర కామేష్టి యాగం, ఉదయం 8 గంటలకు సూర్య ప్రభ అశ్వవాహన సేవ, సాయంత్రం 6 గంటలకు హంస వాహన సేవ వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో పరిసర ప్రాంత భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్



రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రొఫెసర్ భీమ్‌సింగ్ ఆధ్వర్యంలో శనివారం క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, సత్కర్మ్ వాలంటీర్లు, సౌత్ షాపింగ్ కాంప్లెక్స్, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రాంగణంను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ బాటిల్స్, సంచులు, గాజు సీసాలు, చెట్ల కొమ్మలు ,చెత్తాచెదారం తొలగించారు. వీటన్నింటిని ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డ్‌కు తరలించారు.

రక్తదానం ప్రాణదానమే..

రక్తదానం ప్రాణాలు కాపాడుతుందని హెచ్‌సీయూ హెల్త్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో శనివారం ఎన్ఎస్ఎస్ హెచ్‌సీయూ విభాగం సత్కార్మ్ హైదరాబాద్ సంయుక్తంగా రక్తదాత దినోత్సవాన్ని నిర్వహించారు. రక్తదానం గురించి యువతకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ ప్రొఫెసర్ భీమ్‌సింగ్, అసోసియేట్ ప్రొ. నాగమణి, సత్కర్మ్ ప్రతినిధి ఆరుషి పాల్గొన్నారు.